Publication - Sakshi

Date 01/12/2013
Page No 02



# వైద్య వృత్తిని వ్యాపారం చేయకండి

## ప్రైవేట్ వైద్యులకు గవర్నర్ భరద్వాజ్ సూచన

సాక్షి, బెంగళూరు : వైద్య వృత్తిని కేవలం ప్రజల సంక్షేమం కోసం ఉపయోగించాలే తప్ప.. వ్యాపారంగా మార్చకూడదని గవర్నర్ హన్సరాజ్ భరద్వాజ్ ప్రైవేట్ వైద్యులకు సూచించారు. దేశంలో చాలా మంది వైద్యనిపుణులున్నారని, అయితే వైద్యం వ్యాపార రూపం దాల్చడంతో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కడంబ్స్ సంస్థ నగరంలో 'అనునిత' పేరిట ఏర్పాటు చేసిన 'డ్రగ్ డీ అడిక్షన్, రిహాబిలిటేషన్ సెంటర్'ను తమిళనాడు గవర్నర్ రోశయ్య, రాష్ట్ర గవర్నర్ హెచ్.ఆర్.భరద్వాజ్ శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భరద్వాజ్ మాట్లాడుతూ... ప్రైవేటు వైద్యులు కూడా రోజుకు రెండు గంటల పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు అందిస్తే బాగుంటుందని సూచించారు. ఢిల్లీలో చాలా మంది ప్రముఖ వైద్యులు ఇదే విధంగా సేవలందిస్తున్నారని, తద్వారా అక్కడి పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. వైద్యులపై జరిగే దాడులను అరికట్టేందుకు కూడా ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను తీసుకురావాల్సిన అవసరం ఉందని, ఈ విషయంపై ఇప్పటికే తాను ప్రభుత్వంతో చర్చించానని తెలిపారు. అనంతరం రోశయ్య మాట్లాడుతూ... మాదక ద్రవ్యాలు, మద్యపానానికి బానిసలైన వారు మాత్రమే కాక వారి కుటుంబాలు కూడా సమాజంలో అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. సరైన మానసిక ఆరోగ్యాన్ని పొందడం ద్వారా ఈ తరహా వ్యసనాల నుంచి బయటపడేందుకు అవకాశం ఉందని తెలిపారు. ప్రజలకు మానసిక ఆరోగ్యాన్ని చేరువ చేసేందుకు గాను ప్రైవేటు ఆరోగ్య సంస్థలు ప్రభుత్వంతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతరం ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ జీ స్వామినాథ్, డాక్టర్ లతా హేమచంద్రలకు 'కడంబ్స్ సైకియాట్రిస్ట్ అండ్ మెంటల్ హెల్త్ ప్రొఫెషనల్ అవార్డులను రోశయ్య, భరద్వాజ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఆర్ భరద్వాజ్ సతీమణి ప్రభులా భరద్వాజ్, మంత్రి యూటీ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తమిళనాడు, కర్ణాటక గవర్నర్లు రోశయ్య, భరద్వాజ్

### ప్రతి జిల్లా కేంద్రంలో ఓ మానసిక చికిత్సా కేంద్రం ...

ప్రతి జిల్లా కేంద్రంలో ఓ మానసిక చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి యూటీ ఖాదర్ వెల్లడించారు. కడంబ్స్ సంస్థ రూపొందించిన ఫిజీషియన్ గైడ్‌ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు.

పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్(పీపీపీ) విధానంలో ఈ మానసిక చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు గాను ఒక్కో చికిత్సా కేంద్రానికి రూ.18 లక్షలను కేటాయిస్తామని తెలిపారు.